## క్లుప్తంగా

### రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**రాచర్ల:** మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రుణాలకు 21 నుంచి నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్నవారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.

**తర్లుపాడు మండలానికి 12 యూనిట్లు**

**తర్లుపాడు:** మండలంలోని కలుజువ్వల పాడు, తర్లుపాడు గ్రామాల్లో నివసిస్తున్న మైనార్టీలకు 50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలుజువ్వలపాడుకు 5, తర్లుపాడుకు 7 మొత్తం 12 యూనిట్లు మంజూరయ్యాయని వివరించారు.

### 17న సర్వసభ్య సమావేశం

**తర్లుపాడు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17న సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

### విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి

**బేస్తవారిపేట:** విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, సేవా భావాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్వాతంత్య్ర సమరయోధులు, దేశానికి సేవలందించిన నాయకుల గురించి వివరించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ స్వామి గరుడోత్సవం



గరుడోత్సవంలో పాల్గొన్న భక్తులు

**గిద్దలూరు రూరల్:** పట్టణంలోని కొండ మీద గల లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా సోమవారం గరుడోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై అలంకరించి కొండమీదకు ఊరేగింపుగా తరలించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గిరిజానాథస్వామి, వేణుగోపాలస్వామి ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ కళాకారులతో ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన భక్తులను అలరించింది. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేశారు. మంగళవారం రాత్రి గరుడసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# శుద్ధజలం.. అబద్ధం?

- మినరల్ వాటర్ నాణ్యతపై ప్రజల్లో అనేక అనుమానాలు
- నీటి శుద్ధిలో ప్రమాణాలు పాటించని ప్లాంట్ల నిర్వాహకులు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్వో ప్లాంట్లు
- అపరిశుభ్రమైన నీటిని తాగితే రోగాలు తప్పవని వైద్యుల హెచ్చరిక
- ఆర్వో ప్లాంట్ల తనిఖీని పట్టించుకోని అధికారులు



ప్రజలకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్న నీటి బుబుల్స్

**కంభం:** వేసవి ఎండలు నీటి వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. బోరు నీళ్లు, ఉప్పు నీళ్ల అనే భావన ప్రజల్లో అధికం కావడంతో అందరూ ఆర్వో ప్లాంట్ల నీటిని తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు కొందరు మినరల్ పేరుతో అరకొరగా శుద్ధి చేసిన నీటిని విక్రయించి సొమ్ముచేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలో మంచి నీటికి భారీ డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఆర్వో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్లాంట్ల నిర్వహణకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

**నీటి శుభ్రత ఇలా..**

సాధారణ నీటిలో టోటల్ డిజాల్వ్ సాలిడ్స్(టీడీఎస్) 1500 నుంచి దాదాపు 2000 వరకు ఉంటుంది. టీడీఎస్ 1000కి మించితే ఆ నీరు తాగేందుకు వినియోగించకూడదు. ఒకవేళ ఆ నీటిని తరచూ తాగితే కిడ్నీ సమస్యలు, ఇతర అవయవాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు విచ్చలవిడిగా భూగర్భ జలాలను తోడేసి రివర్స్ ఆస్మోసిస్ పద్ధతిలో శుభ్రపరుస్తూ జనాలకు విక్రయిస్తున్నారు. టీడీఎస్ 1500 ఉండే నీటిని శుద్ధి చేసి ఒక లీటరు మినరల్ వాటర్ తయారు చేయాలంటే రెండు లీటర్ల నీరు వృథాగా పోతుంది. శుద్ధి చేసిన నీటిలోని టీడీఎస్ వృథా నీటిలో కలుస్తుంది. ఆ నీటిని భూగర్భంలోకి పంపడం, మురుగు కాలువల్లోకి వదలడం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. వ్యర్థ నీటిని డ్రై బెడ్స్‌లో కేక్‌గా మార్చి పారబోయాలి. అయితే ఆర్వో ప్లాంట్లలో వృథా నీటిని నేరుగా మురుగు కాలువల్లోకి వదిలేస్తున్నారు. మరికొందరు ప్లాంట్ల నిర్వాహకులు ప్రజల అవసరాన్ని ఆసరగా చేసుకుని వృథా నీటిని సైతం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలున్నాయి.

**అధికారుల పర్యవేక్షణ శూన్యం**

గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 300కు పైగా ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో ఐఎస్ఐ సర్టిఫికెట్ పొందిన ప్లాంట్లు వేళ్ల మీద లెక్కపెట్టదగిన స్థాయిలో కూడా లేవు. ఐఎస్ఐ సంగతి అటుంచితే కనీసం స్థానిక అధికారుల అనుమతి లేకుండానే ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. నీటి స్వచ్ఛత, నాణ్యతతో పనిలేకుండా పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇష్టారీతిగా విక్రయిస్తున్న పరిస్థితి. ప్రస్తుతం వేసవి కావడంతో నీటి విక్రయం మరింత పెరిగిపోయింది. ఆర్వో ప్లాంట్ల తీరుపై పలుమార్లు ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నాణ్యత లేని సాధారణ నీటిని బబుల్ రూ.15, కూలింగ్ బబుల్‌ను రూ.30కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**కానరాని శుభ్రత**

ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు సరఫరా చేసే బబుల్స్‌లో ఎక్కువ భాగం అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. బబుల్స్ లోపలి భాగంలో పాచి పట్టి ఉంటోందని, మలినాలు వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. బబుల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసిన తర్వాతే నీరు నింపి విక్రయించాలని ప్రజలు కోరుతున్నారు.

**పాటించాల్సిన నిబంధనలు**

- వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధిత పంచాయతీ అనుమతి తప్పనిసరిగా ఉండాలి.
- భారతీయ ప్రమాణాలు(ఐఎస్ఐ) అనుమతి పొందాలి.
- ప్లాంట్లలో మైక్రోబయాలజిస్టు, కెమికల్ ల్యాబ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాలి.
- ప్రతి 3 నెలలకు ఒకసారి నీటి నాణ్యత ప్రమాణాలు నిర్ధారించేందుకు పరీక్షలు చేయాలి.

**అధికారులు తనిఖీ చేయాలి**



నిబంధనల ప్రకారం నీటిని శుద్ధి చేసిన తర్వాతే విక్రయించాలి. పట్టణాలు, గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. అధికారులు వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– అన్వర్‌బాషా, సీఐటీయూ నాయకుడు కంభం

**అపరిశుభ్ర నీటితో అనారోగ్య సమస్యలు**



పూర్తిస్థాయిలో శుద్ధి చేయని, అపరిశుభ్రంగా ఉన్న నీటిని తాగడం వల్ల కిడ్నీ సమస్యలు, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఐఎస్ఐ ప్రమాణాలు పాటించి శుద్ధి చేసిన జలాన్ని తాగితే ఆరోగ్యానికి మంచిది. చాలా వరకు ప్లాంట్లలో నాణ్యమైన మినరల్ వాటర్ లభించడం లేదు.

– డాక్టర్ శివనాయక్, కంభం ప్రభుత్వ వైద్యశాల

**చర్యలు తీసుకుంటాం**

ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే సమయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనల ప్రకారం ఐఎస్ఐ ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన జలాన్ని విక్రయించాలి. అరకొరగా శుద్ధి చేసి ప్రజలకు విక్రయించకూడదు. ప్లాంట్లను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ, కంభం

# రోడ్డుపై గుంత.. జనానికి చింత



రామాపురం వద్ద గుంతను తాత్కాలికంగా రాళ్లతో పూడ్చిన దృశ్యం



మేడంవారిపల్లె సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

**రాచర్ల:** మండలంలోని రామాపురం నుంచి మేడంవారిపల్లె గ్రామానికి వెళ్లే తారురోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంత వద్ద వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మేడంవారిపల్లె సమీపంలో తారురోడ్డుపై ఏర్పడిన మరో గుంత వాహనదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్తే గుంత ఉన్న ప్రదేశంలో కూరుకుపోవడం ఖాయమని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

**బేస్తవారిపేట:** స్థానిక తేరు వీధి నుంచి బేస్తవారిపేట టౌన్‌లోకి వెళ్లే ప్రధాన రహదారిపై మంచి నీటి వాల్వ్ గుంత ప్రమాదకరంగా మారింది. వాల్వ్ పైకప్పు శిథిలావస్థకు చేరి పగిలిపోవడంతో రాత్రి వేళ రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.



పగిలిపోయిన నీటి వాల్వ్ పైకప్పు

# కేసుల కుట్రలు చంద్రబాబుకే చెల్లు

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి విమర్శ



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

**మార్కాపురం టౌన్:** ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు పోరాడుతున్న సైనికులకు తోడుగా నిలవాలని దేశమంతా ఆలోచిస్తుంటే.. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు మాత్రం వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎలా అణగదొక్కాలో కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడం చంద్రబాబుకే చెల్లుతుందని మండిపడ్డారు. భారత్–పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొని రాష్ట్ర ప్రజలతోపాటు దేశమంతా ఉత్కంఠగా ఉన్న సమయంలో.. మాజీ మంత్రి, బీసీ సామాజికవర్గానికి చెందిన విడదల రజనిపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమన్నారు. మహిళ, మాజీ మంత్రి అనే గౌరవం లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు.

# ఘనంగా బుద్ధ జయంతి



బుద్ధుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

**గిద్దలూరు రూరల్:** పట్టణంలోని కాశినాయన కుంటలో గల గాయత్రిమాత ఆలయం ఆవరణలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో బుద్ధ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ.. బుద్ధ భగవానుడి జీవిత విశేషాలను గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. 29 ఏళ్ల వయసులోనే సన్యాసాన్ని స్వీకరించి సత్యాన్వేషణ కోసం కఠోర దీక్ష చేసి జ్ఞానాన్ని పొందిన మహోన్నత వ్యక్తి బుద్ధ భగవానుడని పేర్కొన్నారు. బుద్ధుడు బోధించిన ధర్మాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ సందర్భంగా గాయత్రి యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, నిర్వాహకులు వీరారెడ్డి, పాలుగుళ్ల కాశిరెడ్డి, బైరెడ్డి బాలిరెడ్డి, దుగ్గా రాజశేఖరరెడ్డి, మల్లారెడ్డి, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చందన అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి



చందన అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి



పూజల్లో పాల్గొన్న జంకె వెంకటరెడ్డి

**మార్కాపురం:** శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మార్కాపురం పట్టణానికి సమీపంలో గుండ్లకమ్మ నది ఒడ్డున కపిలగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారిని చందనంతో అర్చకుడు శ్రీ రంగం రాంబాబు అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి బొగ్గరపు శేషగిరిరావు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

# కంభంలో కార్డన్ సెర్చ్



అర్బన్ కాలనీలోని ఓ గృహంలో తనిఖీ చేస్తున్న ఎస్సై



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

**కంభం:** స్థానిక అర్బన్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున కంభం సీఐ కె.మల్లికార్జున ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మూడు మండలాల పోలీసులు, స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు పాల్గొని కాలనీ మొత్తం జల్లెడపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా తనిఖీలు చేపట్టామని సీఐ తెలిపారు. కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు ఎస్సైలు నరసింహారావు, రవీంద్రారెడ్డి, సుదర్శన్ యాదవ్ పాల్గొన్నారు.

# బదిలీలతో లాంగ్వేజ్ విద్యార్థులకు నష్టం

**మార్కాపురం టౌన్:** ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన హేతుబద్ధీకరణ బదిలీల ప్రక్రియతో మైనర్ లాంగ్వేజ్ చదివే విద్యార్థులకు, పాఠశాలకు తీవ్ర నష్టం జరుగుతుందని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య ద్వారా సెక్షన్లను నమోదు చేయడం, ఉర్దూ, సంస్కృతం తదితర మైనర్ లాంగ్వేజ్ చదివే పిల్లలను ప్రత్యేకంగా చూపించకపోవడంతో పోస్టులు పోయి తీవ్రంగా నష్టం జరుగుతోందని తెలిపారు. 26వ సెక్షన్ వద్ద తెలుగు పోస్టు వస్తుందని ప్రభుత్వ నిబంధనలు ఉండగా కేవలం 4 పోస్టులు మాత్రమే కేటాయిస్తుండటం బాధాకరమన్నారు. ఉర్దూ ప్రథమ భాషగా కలిగిన విద్యార్థులకు ద్వితీయ భాషగా స్పెషల్ తెలుగును ఎవరు బోధించాలో ప్రశ్నార్థకంగా ఉందన్నారు. దీంతో ద్వితీయ భాష తెలుగు చదివే విద్యార్థులను ప్రథమ భాష తెలుగు తరగతుల్లో కలిపి చెప్పడానికి అవకాశం ఉండదన్నారు. ద్వితీయ భాష తెలుగు పాఠ్యపుస్తకం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. ఈ సమస్య వల్ల రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాఠశాలలు నష్టపోతాయని తెలిపారు.

అధికారులు మరోమారు పరిశీలించి పాఠశాలల్లో మైనర్ లాంగ్వేజీ విద్యార్థుల నమోదుకు అవకాశం కల్పించి, పోస్టులు పోకుండా చూడాలని కోరారు. ఉర్దూ, సంస్కృతం తదితర మైనర్ లాంగ్వేజీ చదివే విద్యార్థుల పాఠశాలలకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తీగలేరు కాలువ పనులకు సహకరించాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

**పుల్లలచెరువు:** తీగలేరు కాలువ నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని తీగలేరు సాధన సమితి కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కవలకుంట్ల పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యమ వక్తలు జానకి రఘు, గురునాథం మాట్లాడుతూ పుల్లలచెరువు మండలం తీవ్ర కరువు పరిస్థితులో ఉందని, తాగు, సాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెలుగొండ ప్రాజెక్టును ఇంకా పూర్తి చేయకపోవడం విచారకమన్నారు. ప్రాజెక్టు నుంచి వచ్చే టీ5 కాలువను పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించే విధంగా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోస్టుకార్డుల ద్వారా ప్రభుత్వానికి చేరే విధంగా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి టీ5 కాలువను సాధించే వరకు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్షుడు రఘు, సభ్యులు కోటిరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, నారు వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి, కేశవనారాయణరెడ్డితో పాటు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో పిచ్చి కుక్కల హల్‌చల్

- నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు

**పెద్దారవీడు:** మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో పిచ్చి కుక్కలు సోమవారం నలుగురు చిన్నారులను తీవ్రంగా గాయపరిచాయి. చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో సాలూరి వరుణ్, కర్ణమాల శ్రీహన్స్, రాము, సత్తి మనోజ్‌పై దాడి చేయడంతో చేతులు, కాళ్లపై రక్త గాయాలయ్యాయి. చిన్నారులను మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. రెండు రోజుల క్రితం రెండు గేదెలు, చిన్నారిని పిచ్చికుక్కలు గాయపరిచాయని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చి కుక్కలను నిర్మూలించాలని సర్పంచ్ వెన్నా సంజీవరాణితోపాటు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



## మత్స్యకార యువతకు వాలీబాల్ టోర్నీ



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సుధాకర్‌బాబు, సుబ్బారావు

**కొత్తపట్నం:** కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ (మెరైన్)ఆధ్వర్యంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల స్థాయిలో మత్స్యకారులకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్సై సుధాకర్‌బాబు, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు తెలిపారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అడిషనల్ ఎస్పీ జీబీఆర్ మధుసూదన్‌రావు, డీఎస్పీ బి.నాగేశ్వరరావు, మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు ఆదేశాలు మేరకు టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. మెరైన్ స్టేషన్ గ్రౌండ్‌లో సోమవారం ఎస్సైలు సుధాకర్‌బాబు, సుబ్బారావు రిబ్బన్ కట్ చేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల, ప్రకాశం పరిధిలో 37 గ్రామాలు ఉన్నాయని, ఈ గ్రామాల మత్స్యకారులు పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎస్సై రాజేష్, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com